ముంగిళ్ల మధ్యే.. మెరుగైన వైద్యం

అందరికీ మెరుగైన వైద్యం అందించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూపుదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చక్కటి ఫలితాలు సాధిస్తోంది. పేదల ముంగిళ్ల మధ్య నిర్వహిస్తున్న సురక్ష శిబిరాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై స్పెషలిస్ట్ వైద్యుల సేవలందుకుంటున్నారు. వేలకు వేలు ఖర్చు చేసి కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేని తమను జగనన్న ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నాడని కొనియాడుతున్నారు.

- బురుజుపేట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష
- శిబిరానికి హాజరైన వారి సంఖ్య 500
- 12 రకాల సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందజేత


సురక్ష శిబిరంలో సేవలందించేందుకు సిద్ధంగా ఉన్న ఆరోగ్య మిత్రలు


సురక్ష శిబిరంలో ఉచితంగా మందులు అందజేస్తున్న సిబ్బంది

దాబాగార్డెన్స్ : ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష ధ్యేయం. నియోజకవర్గ పరిధి 36వ వార్డు బురుజుపేట సచివాలయం పరిధిలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. చుట్టు పక్కల ప్రజలు ఈ శిబిరానికి పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సుమారు 500 మంది పరీక్షలు నిర్వహించుకున్నారు. పలువురికి పరీక్షల అనంతరం ఉచితంగా మందులు అందజేశారు. ప్రత్యేక వైద్యం కోసం పలువురిని వివిధ ఆస్పత్రులకు రిఫర్ చేశారు.

అందుబాటులో సేవలు..

ఆరోగ్య సురక్ష కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 12 రకాల వైద్య సేవలు, 14 రకాల పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉంచారు.

ఉదయం 9 గంటల నుంచే..

ఉదయం 9 గంటల నుంచే వివిధ సమస్యలతో బాధ పడుతున్న రోగులను స్పెషలిస్ట్ వైద్యులు పరీక్షించి వైద్యం అందజేశారు. పెద్ద ఎత్తున శిబిరాల వద్ద క్యూ కట్టిన రోగులందరికీ వైద్యులు సేవలందించారు. వారి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటూ పరీక్షలు నిర్వహించారు. సురక్ష కేంద్రానికి వచ్చే వారంతా బడుగు బలహీన వర్గాల వారే కావడంతో వైద్యులు కూడా సేవలందించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రం వైద్యులు హాలీమా, ప్రవీణ్, ఈఎన్‌టీ స్పెషలిస్ట్ డాక్టర్ ప్రవంతి, ఆర్థోపెడిక్ డాక్టర్ రాకేష్, డెంటల్ డాక్టర్ కళ, నేత్ర వైద్యుడు డాక్టర్ రాజుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


నేత్ర పరీక్ష నిర్వహిస్తున్న సిబ్బంది


సేవలందిస్తున్న వైద్యురాలు


ఓపీలు రాస్తున్న సిబ్బంది

ఈ సేవలు నిరంతరం కొనసాగాలి..

మాకు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే స్థోమత లేదు. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ఎలా భగవంతుడా? అనుకుంటున్న సమయంలో జగన్ బాబు పుణ్యమా అంటూ.. నేరుగా మా ఇళ్ల వద్దే మంచి వైద్యం అందుతోంది. మంచి మందులు ఇస్తున్నారు. మాలాంటి పేదల కోసం ఈ కార్యక్రమం నిరంతరం కొనసాగాలి.

– శ్రీనివాసరావు, బురుజుపేట

మా వార్డులోనే వైద్య సేవలు..

మా వార్డులోనే వైద్య సేవలందుతున్నాయి. ఏ మాత్రం ఆరోగ్యం బాగులేకున్నా సమీపంలోనే ఉన్న ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రానికి వస్తున్నాం. ఇక్కడి సిబ్బంది కూడా మాతో మంచిగానే ఉంటున్నారు. వైద్యులు బాగా చూస్తున్నారు. పైసా ఖర్చు లేకుండా వైద్యం అందివ్వడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్లనే జరుగుతోంది.

– అప్పల నరసమ్మ, చెంగలరావుపేట

క్లుప్తంగా

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు


చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది


అల్లిపురం : శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మదీనా, భారతి పాల్గొని చిన్నారులకు కోరింత దగ్గు, పోలియో, హెపటైటిస్–బి వంటి వ్యాధులు రాకుండా టీకాలు, డ్రాప్స్ వేశారు. అదే విధంగా బాలింతలు, గర్భిణులకు తనిఖీలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకునే విధానం తెలియజేసి, మందులు అందించారు. ఆరోగ్య పరిరక్షణకు సూచనలు సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు వసతి ఏర్పాటు


యూనివర్సిటీలో వసతి గృహాలను పరిశీలిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

జగదాంబ : ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీలకు విచ్చేస్తున్న మహిళా క్రీడాకారిణులకు వసతి ఏర్పాటు చేశామని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ బి.సన్యాసినాయుడు తెలిపారు. ఈ పోటీలకు విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వంద మందికి పైగా వివిధ క్రీడలకు సంబంధించి క్రీడాకారిణులు వస్తున్నారన్నారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు వారందరికీ ఏయూ ఉమెన్స్ హాస్టల్లో వసతి ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, విద్యుత్, భోజనం, శానిటేషన్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

మహిళా కళాశాలలో ఆవర్తన పట్టిక దినోత్సవం


గెలుపొందిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

దాబాగార్డెన్స్ : నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బుధవారం జాతీయ ఆవర్తన పట్టిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ అరుణపద్మ, రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకుడు డాక్టర్ బి. కల్యాణ్ రామ్, సంతోషి, అనూష, విద్యా కల్పన, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


మాట్లాడుతున్న జెడ్సీ సన్యాసినాయుడు

అల్లిపురం : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర లక్ష్య సాధనలో అర్హత గల ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని పార్వతీపురం బీజేపీ మాజీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం అల్లిపురంలోని బంగారుమెట్టలో జరిగిన కార్యక్రమంలో ఆయనతో పాటు జీవీఎంసీ జోన్–4 కమిషనర్ సన్యాసినాయుడు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పుల రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వివక్షతావు లేకుండా సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ నినాదంతో 2047లోపు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రధాన మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శాలివాహన, బీడీవీఎస్ఎస్ స్వామి, ఏపీడీ పుణ్యవతి, పీవో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గెలుపే ధ్యేయంగా పని చేయాలి


బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న అలపన కనకరెడ్డి

జగదాంబ : రానున్న ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకుంటామని జీవీఎంసీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ వార్డు కార్యాలయంలో బూత్ ప్రెసిడెంట్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా వాసుపల్లి గణేష్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇవ్వాలన్నారు. ఇందుకు బూత్ ప్రెసిడెంట్లు కృషి చేయాలన్నారు. ఎన్నికల నగారా మోగినప్పటి నుంచి అందరం వైఎస్సార్‌సీపీ గెలుపునకు పని చేయాలన్నారు. ప్రజలకు జగనన్న అందజేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధి గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ ప్రెసిడెంట్లు ఆదివిష్ణు, సుబ్రహ్మణ్యం, రమణమ్మ, మళ్ల బుజ్జి, పుష్ప, బత్తుల రాము, రవికుమార్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల మాత్రల పంపిణీ


అంగన్‌వాడీ సిబ్బందికి ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తున్న ఆశ వర్కర్ లీలావతి

అల్లిపురం : ఈ నెల 9వ తేదీన జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్లు నియోజకవర్గంలోని కొబ్బరితోట యూపీహెచ్‌సీ, భీమ్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలో ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి ఆల్బెండాజోల్ మాత్రలను బుధవారం అందజేశారు. ఈ నెల 9న మాత్రలు మింగని పిల్లల చేత 16వ తేదీన మింగించాలని సూచించారు.

కంటి అద్దాల పంపిణీ.. ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో భాగంగా అవసరమైన లబ్ధిదారులకు కంటి అద్దాలను ఆశ వర్కర్ల ద్వారా ఉచితంగా అందజేశారు. వారి ఇంటికి వెళ్లి కంటి అద్దాలు అందజేయటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు

- దివ్యాంగులు, ఓటర్లకు వసతులు కల్పించండి
- అధికారులతో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్, పాల్గొన్న అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు

మహారాణిపేట: సాధారణ ఎన్నికలకు ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీస సౌకర్యాలు తప్పక కల్పించాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఏఈఆర్వోలు, వివిధ శాఖల అధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని బీఎల్వోలతో కలిసి తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రం వద్ద దివ్యాంగులకు ర్యాంపులు, ఓటర్లకు టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూత్ బయట ఆ కేంద్రం వివరాలు తప్పక నమోదు చేయాలని చెప్పారు. 10 కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న ఇళ్లను పరిశీలించాలన్నారు. జనవరి 5 తరువాత అందిన ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, చేరికలు, తొలగింపులు జాగ్రత్తగా చేపట్టాలన్నారు.

సమస్యలుంటే తెలపండి..

ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాల్లో ఏమైనా సమస్యలుంటే తక్షణం తెలియజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జేసీ మయూర్ అశోక్ కోరారు. కలెక్టరేట్‌లో తూర్పు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. తూర్పు పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సమస్యలేమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అన్ని కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏఈఆర్వోలు, అధికారులు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది జగనన్న ప్రభుత్వమే


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నాయకులు

- ఇంద్రకీలాద్రిలో కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ప్రజల దీవెనలు, దేవుని ఆశీస్సులతో మళ్లీ జగనన్నే సీఎం అవుతారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం విజయవాడలోని శ్రీకనకదుర్గమ్మను ఆయన దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికి అర్చకులు అమ్మవారి దర్శనం కల్పించారు. ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలకు హాజరై విజయవాడలో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అన్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లేనన్నారు. కోరిన కోర్కెలు తీర్చే దుర్గాలమ్మ కరుణా కటాక్షాలు, ప్రజల అండదండలతో 175 సీట్లు గెలిచి జగనన్న సీఎం కావాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. పేదలకు మేలు చేస్తే ఓర్వలేని ప్రతిపక్షాలు, చంద్రబాబు అండ్ కో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రాబాబుకు ఇవే చివరి ఎన్నికలన్నారు. ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ అమ్మవారి ఆలయం చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వయంగా జలాభిషేకం చేశారు. దొండపర్తి, నెహ్రూబజార్, రైల్వే న్యూకాలనీ, పెదవాల్తేరు, మద్దిలపాలెం, అక్కయ్యపాలెం, శివాజీపాలెం, ఎన్ఏడీ, సీతమ్మధార, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, జగదాంబ, వన్‌టౌన్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం పసుపు, కుంకుమ, పలు రకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారి చీరల బహిరంగ వేలం..

ఎరుకుమాంబ అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లు గురువారం 8వ తేదీన, మరల 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి దేవస్థానం ప్రాంగణంలో బహిరంగ వేలం వేసి విక్రయిస్తామని ఆలయ ఈవో రమాబాయి, చైర్మన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో భారీ అన్నదానం


అన్నదానం చేస్తున్న వాసుపల్లి జానకీరామ్

మహారాణిపేట : విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శ్రీ జటా గంగేశ్వర రాజ్యశ్యామల అమ్మవారి యజ్ఞం, గంగా హారతి జరిగిన సందర్భంగా బుధవారం శ్రీ గంగమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు అయిదు వేల మంది భక్తులు పాల్గొని గంగమ్మ తల్లి ప్రసాదం స్వీకరించారు. సుమారు 15 రోజుల పాటు అందరూ అమ్మవారి శాంతి యజ్ఞం కార్యక్రమంలో తలమునకలై చివరి రోజు అన్నదాన కార్యక్రమం వరకు పూర్తిస్థాయిలో కష్టపడి ఈ మహా యజ్ఞాన్ని, అన్న సమారాధన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు, పెద్దలు, ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, విశాఖ పార్లమెంట్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బొత్స ఝాన్సీకి వాసుపల్లి జానకిరామ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలపల్లి నరసింహులు, ఉపాధ్యక్షుడు గుంటూరు దానయ్య, దూడ పోలయ్య, పుక్కళ్ళ ఈశ్వరరావు, గణగళ్ల రాజేష్, గణగళ్ల పోతయ్య, గుంటు సత్తయ్య, బ్రహ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతకు నిర్వచనం సుబ్బరాజు

అల్లిపురం : నీతి, నిజాయితీలకు నిర్వచనం కాకర్లపూడి సుబ్బరాజు అని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు అన్నారు. తీవ్ర అనారోగ్యంతో ఇటీవల మరణించిన పార్టీ సీనియర్ నాయకుడు, అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల యూనియన్ (ఏఐబీఈయూ) మాజీ నాయకుడు, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంకు మాజీ పాలకవర్గ సభ్యుడు కేవీ సుబ్బరాజు సంస్మరణ సభ బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, సీపీఐ విశాఖ జిల్లా నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్‌కే రెహమాన్, క్షేత్రపాల్, విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ సిబ్బంది, సుబ్బరాజు కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాజు బ్యాంకు ఉద్యోగం చేస్తూ యూనియన్ కార్యకలాపాల కోసం ఉన్నత హోదాను సున్నితంగా తిరస్కరించి పార్టీ, యూనియన్ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేశారన్నారు.

విషం తాగి వ్యక్తి మృతి

అల్లిపురం : విషం తాగి వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని తండ్రి ఇప్పిలి తాతారావు తెలిపిన వివరాల ప్రకారం ఇప్పిలి దక్షిణకుమార్ (34) కంచరపాలెం, బర్మాక్యాంపులో కుటుంబంతో కలిసి నివసిస్తున్నాడు. అతను గత ఏడు సంవత్సరాలుగా కువైట్‌లో ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం ఇండియా వచ్చి తండ్రి వద్ద ఉంటున్నాడు. తనకు ఆన్‌లైన్లో ఒక యువతి పరిచయమైందని తెలిపారు. ఆమెను మరో మహిళతో రెండు సార్లు ఇంటికి తీసుకువచ్చాడని తెలిపారు. మంగళవారం రాత్రి 8.25 గంటల సమయంలో దక్షిణ్‌కుమార్ వాట్సప్ కాల్ చేసి తాను ఆన్‌లైన్లో ప్రేమించిన ఆమె తనను మోసం చేసిందని, అందుకు తాను విషం తీసుకుంటున్నానని చెప్పాడన్నారు. ఆ సమయంలో దక్షిణకుమార్ ప్రేమించిన మహిళ అతని పక్కనే ఉందని, ఆమె తన కుమారుడు విషం తీసుకున్నాడని తెలిపిందన్నారు. తర్వాత ఆమె అతడిని అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించటంతో అక్కడ చికిత్స అందించారన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ దక్షిణ్‌కుమార్ బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తనిఖీల్లో 84 వాహనాల సీజ్

సీతమ్మధార: ద్వారకా, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 5 గంటల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ద్వారకా పీఎస్ పరిధిలో సీఐ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ ధరేంద్ర, ఆర్ఐల నేతృత్వంలో గురుద్వారా, సీతంపేట దుర్గాగణపతి ఆలయం, ఆశీలమెట్ట, ద్వారకానగర్, రామాటాకీస్, సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి నంబర్ ప్లేట్, సైలెన్సర్లు, పత్రాలు, మద్యం తాగి నడిపిన 62 వాహనాలను సీజ్ చేశారు. ఫోర్త్‌టౌన్ పీఎస్ పరిధిలోని దొండపర్తి, డైమండ్ పార్కు, అక్కయ్యపాలెం హైవే తదితర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి 22 వాహనాలను సీజ్ చేశారు.